

కలెక్టర్‌ను కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి -పాడేరు:జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ను అల్లూరి జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అమిత్ బర్దర్ మర్యాద పూర్వకంగా మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా గంజాయి నియంత్రణ, ప్రత్యామ్నాయ పంటలు, లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం, ఉపాధి, తదితర అంశాలపై ఇరువురు చర్చించారు.



మొక్కను ఇస్తున్న ఎస్‌పి



కూలిన పాఠశాలను పరిశీలిస్తున్న గ్రామస్తులు

విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం

- వర్షాలకు కూలిన తొంగికోట పాఠశాల
- ఐచ్ఛిక సెలవు కావడంతో 23 మంది ప్రాణాలు సురక్షితం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని వనమసింగి గ్రామ పంచాయతీకి చెందిన తొంగికోట గ్రామంలోని ఎంపీపీ స్కూల్లో పెను ప్రమాదం తప్పింది. గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి టొంగికోట ఎంపీపీ పాఠశాల భవనం మంగళవారం కూలి నేల మట్టమైంది.మంగళవారం పాఠశాలలకు ఐచ్ఛిక సెలవు కావడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది.ఈ విషయాన్ని మండల విద్యా శాఖ అధికారి కే కృష్ణమూర్తికి గ్రామస్తులు తెలియజేశారు. ఈ మేరకు పెదగూడ స్కూల్ కాంప్లెక్స్ సిఆర్‌పి అనిల్ పాఠశాలను పరిశీలించారు. ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులు ఉంటే పెను ముప్పు వాటిల్లి ఉండేదని తల్లిదండ్రులు తెలిపారు. ఈ పాఠశాలలో 23 మంది విద్యార్థులు విద్యనభ్యాసిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు, ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్‌లు స్పందించి నూతన పాఠశాల భవనం నిర్మించాలని విద్యా కమిటీ చైర్మన్ మర్రి రాజు, గ్రామస్తులు కిముడు జయరాం, కిముడు రాంబాబు, మర్రి ఆనందరావు, కరింగు రామారావు, కిల్లో సీతారాం, దేశిద హరికృష్ణ, కిముడు తిరుపతి, మర్రి సుబ్బారావు ప్రభుత్వాన్ని కోరారు.

ప్రమాదపుటంచున మరో పాఠశాల

జి.మాడుగుల: మండలంలో వంతాల పంచాయితీ రాచపనుకు గ్రామంలో పాఠశాల పూరి గుడిసెలో కొనసాగుతోంది. నాడు నేడులో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనం నిధుల కొరతతో శ్లాబ్ దశలో అర్ధాంతరంగా నిలిచి పోయింది. దీంతో, విద్యార్థులు పాఠశాల భవనం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కర్రలతో తయారు చేసిన తాత్కాలిక చిన్న పూరి గుడిసెలో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గాలి వానలు సంభవించినప్పుడు అది కాస్త కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు చొరవ తీసుకొని నిర్మాణ పనులను చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పూరిగుడిసెలో ఉన్న పాఠశాల

వరదల సమయంలో అన్ని సౌకర్యాలూ కల్పించాలి

చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య ఆదేశం

ప్రజాశక్తి-విఆర్.పురం

వరదల సమయంలో ప్రజలు ఎటువంటి ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య అధికారులను ఆదేశించారు. మండలంలోని రేఖపల్లి తహశీల్దారు కార్యాలయంలో వరదల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ చైతన్య మాట్లాడుతూ వరదలపై ముందస్తు చర్యలు ఎలా చేపట్టాలని, వరదలు వస్తే ఎలా ఎదుర్కోవాలని సూచించారు. వరదలు వచ్చినప్పుడు పునరవాస కేంద్రాల్లో ఉన్నవారికి అన్ని వసతులు కల్పించాలని, నిత్యావసర సరుకులు, మంచినీరు, బరకాలు, కిరోసిన్, బియ్యం, అందించాలని కోరారు. ప్రజలకు అసౌకర్యం కలగనివ్వొద్దని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. తహశీల్దారు సయ్యద్ మౌలానా పాజిల్, మాట్లాడుతూ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుగానే గ్రామసభలు పెట్టి వరదలు వచ్చినప్పుడు ప్రజలు ఎలా ఎదుర్కోవాలో వివరించామని, వరద ముప్పు ఉన్న గ్రామాలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ కె.నాగరాజు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఏవో రవికుమార్, ఎంఈఓ లక్ష్మీనారాయణ, ఎడిఎంహెచ్ఒ పుల్లయ్య, ఎఎస్‌డిఎస్ సంస్థ అధినేత ఉండవల్లి గాంధీ బాబు, రెవెన్యూ, వైద్య, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య

మొదటి యూనిట్ వినియోగంలోకి తేవాలి

ఎపి జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు

ప్రజాశక్తి-సీలేరు

సీలేరు జల విద్యుత్ కేంద్రంలో మొదట యూనిట్‌ను త్వరితగతిన వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని ఎపి జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు ఆదేశించారు. చీఫ్ ఇంజినీరుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మొట్టమొదటిసారిగా మంగళవారం సీలేరులో విస్తృతంగా పర్యటించారు. జల విద్యుత్ కేంద్రంలో మొదటి యూనిట్ మరమ్మతు పనులు, స్విచ్ యార్డ్, ఎంసిఆర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. మొదటి యూనిట్లో తలెత్తిన సాంకేతిక లోపాలపైనా, మిగతా మూడు యూనిట్లు పనితీరుపైనా ఈఈ రాజేంద్రప్రసాదుని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీలేరు జల విద్యుత్ కేంద్రానికి నీరందించే రెగ్యులేటరీ డ్యాం, మెయిన్ డ్యాం, ఇంటెక్ డ్యాం, గుంటవాడ రిజర్వాయర్‌ను పరిశీలించారు. గుంటవాడ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు, బలిమెల నుంచి ఆంధ్రా వాటాగా ప్రస్తుతం ఎంత నీటిని తీసుకుంటున్నాం తదితర అంశాలను ఈఈ సివిల్ ప్రభాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. రెగ్యులేటరీ డ్యాం, మెయిన్ డ్యాం గేట్లు, ఇంటెక్ డ్యాం పనితీరు వీటి నిర్వహణ పనులపై ఆరా తీశారు. సీలేరులో నూతనంగా నిర్మించనున్న 1350 మెగావాట్ల సామర్థ్యం గల పంప్ స్టోరేజ్ ప్రాజెక్టు వివరాలను పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఎస్ఇ చంద్రశేఖర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించి యూనిట్లు పనితీరు విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై ఆరా తీశారు.



మెయిన్ డ్యామ్‌ను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు:అడవులను సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షించ వలసిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. అటవీ శాఖ, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ, పిఐయు, రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్ నుండి మంగళవారం పర్చువల్ విధానంలో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫారెస్టు, రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి రహదారుల నిర్మాణానికి ఫారంలో ఎలో అటవీ శాఖ అనుమతులకు పంపించాలని సూచించారు. అటవీ శాఖ అధికారులు జాప్యం చేయకుండా ఫారం బిలో అనుమతులు జారీ చేయాలని చెప్పారు. మారుమూల గ్రామాలకు రహదారులు నిర్మించేటప్పుడు ముందుగా గ్రామసభ తీర్మానం చేయాలన్నారు. గ్రామ సభ తీర్మానంలో ఇక మీదట భవిష్యత్తులో పోడు చేయమని గ్రామస్తుల ఆమోదం తీసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖకు 5 రోడ్లు, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో 6 రోడ్ల నిర్మిణానికి జిల్లా స్థాయి కమిటీలో ఆమోదించామని చెప్పారు. రోడ్ల నిర్మాణాలకు అటవీ శాఖ అధికారులు సానుకూలంగా ఉండాలన్నారు. అదే విధంగా అడవులను నిర్మూలిస్తే ఉపేక్షించనని చెప్పారు. గత పదేళ్లలో రహదారుల నిర్మాణాల నిమిత్తం అనుమతించిన వివరాలపై ఆరా తీసారు. సెల్ టవర్ల నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తామని చెప్పారు.ఈ సమావేశంలో డి. ఆర్.ఓ. బి. పద్మావతి, వర్చువల్‌గా పాడేరు డి.ఎఫ్ఓ వినోద్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇ డి.వి.ఆర్. ఎం.రాజు, పిఐయు ఇఇ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఇఇ కొండయ్యపడాల్, 11 మండలాల తహశీల్దారులు తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ ట్రెడిషనల్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ఆదివాసీ ట్రెడిషనల్ కేంద్రం ప్రారంభం

ప్రముఖ పర్యాటక కేంద్రం పాడేరు మండలంలోని వంజంగి మంచు మేఘాలకొండకు సమీపంలోని వంజంగి బోలెంగమ్మ తల్లి ఆదివాసీ సాంప్రదాయాల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. వంజంగి మంచు మేఘాల కొండకు వచ్చే పర్యాటకులకు వంజంగి బోలెంగమ్మ తల్లి ఆదివాసీ సాంప్రదాయాల కేంద్రం ప్రత్యేక ఆకర్షణ కానుంది. వంజంగి కొండకు వెళ్లే మార్గంలో సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ సహకారంతో ఆదివాసీ సాంప్రదాయాల కేంద్రం, ఆదివాసీ ఆహార కేంద్రంలను నిర్మించారు. జిల్లా కలెక్టర్ ఆయా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సాంప్రదాయాల కేంద్రం మహిళా నిర్వహణ కమిటీ సభ్యులు తయారు చేసిన గిరిజన సాంప్రదాయ వంటకాలను కలెక్టర్ రుచి చూసి మెచ్చుకున్నారు.

అనంతరం ఏర్పాటు చేసిన వేదిక వద్ద సి.పి.ఎఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఆదివాసీ సాంప్రదాయాల కేంద్రం ఏర్పాటుకు కారణం, లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, బోలెంగమ్మ తల్లి సాంప్రదాయాన్ని కాపాడుతామని, వంజంగి కొండపైకి పర్యాటకులు ప్లాస్టిక్ తదితర వస్తువులు తీసుకొని వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ డైరెక్టర్ గిరిజాదేవి, మేనేజింగ్ ట్రస్టీ కామేశ్వరరావు, ప్రోగ్రాం అధికారులు లోకేష్, సత్యనారాయణ, బాలరాజు నాగమణి, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ వంజంగి కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని సీజనల్ వ్యాధుల పట్ల గిరిజనులు జాగ్రత్తగా ఉండాలని కించమండ పంచాయితీ సర్పంచ్ హెచ్ బి చెల్లమ్మ సూచించారు. ఆ పంచాయతీ పరిధి గౌలి గ్రామంలో సందర్శించిన ఆమె గిరిజనులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వర్షాలతో వ్యాధులు పొంచి ఉన్నాయన్నారు. నివాస గృహ ఆవరణలో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మురుగు నీటి కాలువలను శుభ్రంగా ఉంచుకోవాలని, చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవన్నారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది సూచించిన మందులను తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆమె కోరారు.

నారుమడుల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పలు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పర్యటన

ప్రజాశక్తి -మాడుగుల: రైతులు వరి నారుమడులలో నీటి, ఎరువులు యాజమాన్యం చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి ఎం.వాసుదేవరావు అవగాహన కల్పించారు. మంగళవారం రైతు సేవ కేంద్ర సిబ్బందితో కలిసి మండలంలోని పోతనపూడి, వీరనారాయణం, గొటివాడ అగ్రహారం గ్రామాలలో వరి నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ, వరి నారుమడులలో అధికంగా నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నీరు అధికంగా ఉన్నట్లయితే విత్తనం మురిగి పోతుందన్నారు. అధికంగా ఉన్న నీటిని బయటకు పంపుటకు నారుమడులలో కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నారు వేసిన 10-15 రోజుల మధ్యలో ప్రతి 5సెంట్ల నారుమడికి 2 కిలోల యూరియా, 2 కిలోల డిఏపి, 2 కిలోల పోటాష్ ఎరువులను తప్పని సరిగా వేయాలన్నారు. ఈ. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది గౌరినాయుడు, రేణుక, శ్రీమవాసరావు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్:

రావికమతం మండలం లో రావికమతం, కొమిర, చినపాచిల తదితర గ్రామాల్లో వరి నారు మడులను రావికమతం మండల వ్యవసాయ అధికారిని డి.రూప పరిశీలించారు. రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు వాడకం, ఉపయోగాలను వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరి నారు మడులు సంరక్షనపై వివరించారు. ఈ కార్యక్రమంలో పలువు రైతులు పాల్గొన్నారు.

పెద్ద బీరంపల్లిలో తాగునీటి కష్టాలు

గాలివానకు ప్లాస్టిక్ వాటర్ ట్యాంకు కిందపడి పగిలిన వైనం

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని పెద్ద బీరంపల్లి గ్రామంలో సుమారు నెల రోజులుగా స్థానికులు తాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. గ్రామంలో తాగునీటి పథకానికి సంబంధించిన ప్లాస్టిక్ వాటర్ ట్యాంకు నెల రోజుల క్రితం గాలి వర్షానికి కింద పడిపోయి పగిలిపోయింది. దీంతో అప్పటి నుండి గ్రామంలోని సుమారు 20 కుటుంబాలకు నీరు లేక తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. గ్రామంలో ఉన్న సత్యసాయి వాటర్ ట్యాంక్ నుండి ఎప్పుడో తప్ప నీరు రావడం లేదు. గ్రామంలో రెండు చేతి పంపులు ఉండగా, ఒకదానికి తాగునీటి పథకానికి నీరు అందించేందుకు మోటార్ బిగించారు. ఉన్న ఒక బోరు కూడా సరిగా పని చేయడం లేదు. ఈ బోరు ఒక సారి ఉపయోగిస్తే ఐదు నుండి పది బిందెలు మాత్రమే నీరు వస్తుందని, మళ్లీ నీరు రావాలంటే సుమారు రెండు గంటలు సమయం పడుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ బోరు నుండి వచ్చే అరకొర నీటితోనే నెల రోజులుగా సర్దుకుంటున్నామని ఆ గ్రామానికి చెందిన చలం శ్వేత, పిల్లా మణి, కారం రాజకుమారి, పర్సిక పాపయమ్మ, చవలం బాపనమ్మ తదితరులు తెలిపారు. పగిలిపోయిన వాటర్ ట్యాంకు స్థానంలో కొత్తది ఏర్పాటు చేయడానికి గ్రామంలోని మహిళలందరూ కలిసి పునాది తవ్వి దిమ్మకట్టేందుకు పూనుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్తగా తాగునీటి ట్యాంకును ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ మహిళలు కోరారు.



నిరుపయోగంగా ఉన్న సత్యసాయి వాటర్ ట్యాంకు



వినతిపత్రం ఇస్తున్న జోగారావు తదితరులు

పిహెచ్‌సిలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని వినతి

ప్రజాశక్తి-కూనవరం

కూనవరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పిహెచ్‌సికి బడ్జెట్ కేటాయించి సౌకర్యాలను కల్పించాలని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు మంగళవారం డిప్యూటి డిఎంహెచ్ఒ డాక్టర్ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ కూనవరం పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యాధికారులు ఉన్నప్పటికీ సిబ్బందిని నియమించకపోవడంతో రోగులకు వైద్య సేవలు అందించలేకపోతున్నారని తెలిపారు. బడ్జెట్ లేకపోవడం వలన మెడిసిన్‌కి ఇబ్బందులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఆన్లైన్‌లో ఈ-ఔషధి పోర్టల్ లేక అనేక ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. తక్షణమే ఈ సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డి.సర్వేశ్వరరావు, కె.సాయి కుమార్, కె.రమేష్, నగేష్, కె.రాజు, సతీష్, జీవన తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కూలిన బాధితునికి వైసిపి సహాయం

ప్రజాశక్తి-సీలేరు : గూడెం కొత్తవీధి మండలం దుప్పులవాడ గ్రామంలో భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయి వీధిని పడ్డ వంతల శుక్ర అనే రైతుకు పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు వైసిపి నాయకులు కంకిపాటి గిరి, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ పసుపులేటి నాగమణి మంగళవారం 50 కేజీల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు, రూ.2000 నగదు అందజేశారు. ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు, వైసిపి నాయకులకు వంతల శుక్ర ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుప్పులవాడ సర్పంచ్ కిల్లో కుమారి, ఎంపిటిసి సిహెచ్ ఉల్లాస్, పాల్గొన్నారు.

మలేరియా నివారణ మందు పిచికారీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-దేవీపట్నం

మండలంలోని జి.తాటివాడ గ్రామంలో మలేరియా నివారణ మందు స్ప్రే కార్యక్రమాన్ని అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ శిరీష మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో మలేరియా కేసు ట్రీట్మెంట్ క్రమాన్ని పరిశీలించారు. అనంతరం గిన్నెపల్లి గ్రామంలోని ఎయిడెడ్ స్కూల్‌ని సందర్శించి పిల్లల ఆరోగ్య వివరాలు మేనేజ్మెంట్‌తో మాట్లాడి తెలుసుకున్నారు. స్థానిక ఆశా కార్యకర్త వారానికి ఒకసారి స్కూల్‌ని సందర్శించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఏఎంఓ శ్రీనివాసరాజు, దేవీపట్నం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అపూర్వ, స్థానిక ఏఎన్ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పి, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎడిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ శిరీష

చోరీల నియంత్రణకు చర్యలు



మాట్లాడుతున్న సిఐ రమేష్

ప్రజాశక్తి-పెదబయలు: పెదబయలు మండల కేంద్రం సీతగుంట పంచాయతీ మొదసాయి నగర్‌లో దొంతనాలను నియంత్రిస్తామని జి.మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.రమేష్ వెల్లడించారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌ల్లో విలేఖరులతో మాట్లాడుతూ రెండు నెలల్లో మొదసాయి నగర్లో ఉద్యోగుల ఇళ్లల్లో తరచు దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఇంటిలో సిసి కెమెరా ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి సమయంలో అపరిచితులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

బాధితురాలికి భారతీ గ్యాస్ సాయం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో ఇటీవల పిక్కి పాపయ్యమ్మ ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి గ్యాస్ లీక్ అవడంతో పూరిల్లు దగ్ధమయింది. ఈ ప్రమాదంలో ఆమె సర్వం కోల్పోయింది. ఈ మేరకు భారతీ గ్యాస్ యాజమాన్యం స్పందించి ఆమెకు గ్యాస్ స్టవ్, సిలిండర్, రెగ్యులేటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తెప్పలు ప్రెసిడెంట్ బొంది నూకరాజు, చేపలు సోమేష్, 10వ వార్డు మెంబర్, సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి మైలపల్లి మహేష్ బాబు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బొందలపు అప్పలరాజు, పిక్కి తాతీలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-నక్కపల్లి:సీజనల్ వ్యాధులు ప్రబులుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాస్ పంచాయతి కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రస్తుతం వర్షాలు కురవడంతో దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, వీటి నివారించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిరోజు గ్రామాల్లో శానిటేషన్ చేయించాలన్నారు. డ్రైనేజీలను పరిశుభ్రం చేయించాలని సూచించారు.పెన్షన్ల పంపిణీ, ఉపాధి హామీ, హౌసింగ్ శాఖలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏవో సీతారామరాజు, ఈఓపిఆర్‌డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాకలో చెరువు గట్టు, మండపం వద్ద ఉపాధి కూలీలతో పిచ్చి మొక్కలు తొలగింపు చేపట్టారు. చెరువు ప్రాంతంలో రోడ్డు కు ఇరువైపులా, మండపం ప్రాంతంలో పిచ్చి మొక్కలు, గడ్డి వేపుగా పెరిగాయి. జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, టిడిపి నాయకులు బుజ్జి స్థానిక విఆర్‌పి శ్రీనుకు తెలియజేయడంతో ఉపాధి కూలీలతో మొక్కల తొలగింపునకు పనులు చేపట్టారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక శారదానగర్ రవీంద్రభారతి పాఠశాలలో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ వేడుకను ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా హాజరైన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వంజరి సత్యనారాయణ విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలను అందించారు. నాయకత్వ ప్రాముఖ్యత, లక్షణాలను, విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. రవీంద్రభారతి విద్యాసంస్థల చైర్మన్ ఎంఎస్.మణి విద్యార్థి నాయకులకు చిత్తశుద్ధి, అంకితభావం శ్రేష్టత, నిబద్ధత వంటి ఉత్తమ లక్షణాలు కలిగి ఉండాలని తెలియజేశారు.నార్త్ ఆంధ్ర జోనల్ ఇంఛార్జ్ ఎస్.వెంకటేష్ తోటి విద్యార్థులలో క్రమశిక్షణను, నైతిక విలువలను, బాధ్యతను పెంపొందింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కెవిఎస్.గిరి, ఏజీఎం జివిఎస్ఎన్.మూర్తి, డివిజనల్ ఇన్‌చార్జ్ సిహెచ్.గోవింద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా శాకాంబరి ఉత్సవాలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శాకాంబరీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారిని ఆకు కూరలు, వివిధ రకాల పండ్లతో అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ర్యాంకింగ్

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో మొబైల్, రోడ్డు కనెక్టివిటీ, సూపర్వైజర్, సిడిపిఓ ఖాళీలు, పిల్లలు హాజరు తక్కువ, సప్లై పాయింట్ నుంచి దూరం, గ్రోత్ మానిటరింగ్, మెటర్నల్ ఇన్ఫాంట్ మోర్టాలిటీ, తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని క్రిటికల్ అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరం నుండి అంగన్వాడి కార్యకలాపాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడి కార్యకర్తలు సరిగా పని చేయనట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముందుగా జిల్లాలో సగటు హాజరును అడిగినప్పటికీ సూపర్వైజర్, సిడిపిఓ, పిడి సరిగా స్పందించకపోవడం, డేటా లేకుండా హాజరు కావడంపై కలెక్టర్ అసహనాన్ని వ్యక్తం చేశారు. తదుపరి సమావేశానికి ఆఫ్లైన్, ఆన్లైన్ హాజరును డేటా రూపంలో సమర్పించాలని ఆదేశించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారాలపై ర్యాంకింగ్ ఇవ్వాలని సూచించారు. ర్యాంకింగ్ ఆధారంగా కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా పలువురు సిడిపివోలు మాట్లాడుతూ, ఎండియు వాహనం రాలేదని, బయోమెట్రిక్ వేసిన తర్వాత సరుకులు పంపడం లేదని, పలుచోట్ల డీలర్ల సమస్య ఉందని, కొన్నిచోట్ల వంట నూనె సరఫరా సరిగా లేదని తెలిపారు. గుడ్లు నాణ్యత బాగోలేదని, తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ నాణ్యత లేని వస్తువులను వెనక్కి పంపించాలని సూచించారు. సరుకుల పంపిణీకి సంబంధించి ప్రతి మండలంలో ముగ్గురు సిబ్బందితో బృందాన్ని ఏర్పాటు చేసి సరఫరా చేయని వారి వివరాలను తమ దృష్టికి తీసుకు వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సరుకులను సరిగా సరఫరా చేయని డీలర్లపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్వాడీలు సరిగా పనిచేయకపోతే సంబంధిత సూపర్వైజర్లు, సిడిపిఓలను బాధ్యులను చేస్తామన్నారు.బాల్య వివాహాల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సిడిపివోలు, ఎంపీడీవోలతో కలిసి గ్రామాలలో సమీక్షించాలని, చైల్డ్ మ్యారేజ్ కమిటీలో సర్పంచులను గ్రామ పెద్దలను చేర్చాలని, బాల్య వివాహాలతో జరిగే నష్టాలను వివరించాలని సూచించారు.బాల్యవాహం జరిపించే తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు.ఈ సమావేశంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి, పాడేరు డివిజన్లో 11 ప్రోజెక్టుల సిడిపివోలు, సూపర్వైజర్లు, రంపచోడవరం చింతూరు డివిజన్లోని ఎనిమిది ప్రాజెక్టుల సిడిపివోలు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి


సమస్యను తెలుసు కుంటున్న సిపిఎం నాయకుడు మోహన్

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని వాలసి పంచాయతీ పరిధి పొర్లుబంద గ్రామంలో తాగునీటి సమస్యతో గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ గ్రామంలో తాగునీటి పైపులైన్ బోరు బావి వంటి పథకాలు మంజురు చేయలేదని సిపిఎం వాలసి పంచాయతీ నాయకుడు మోహన్ పేర్కొన్నారు. సమస్యలు తెలుకునేందుకు మంగళవారం సందర్శంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుమూల గిరిజన గ్రామాల్లో తాగునీటి, ఇతర మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

వరి నారుమడుల్లో అధికంగా నీరు లేకుండా చూడాలి

ప్రజాశక్తి - మాడుగుల: రైతులు వరి నారుమడులలో నీటి, ఎరువులు యాజమాన్యం చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి ఎం.వాసుదేవరావు అవగాహన కల్పించారు. మంగళవారం రైతు సేవ కేంద్ర సిబ్బందితో కలిసి మండలంలోని పోతనపూడి, వీరనారాయణం, గొటివాడ అగ్రహారం గ్రామాలలో వరి నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ, వరి నారుమడులలో అధికంగా నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నీరు అధికంగా ఉన్నట్లయితే విత్తనం మురిగి పోతుందన్నారు. అధికంగా ఉన్న నీటిని బయటకు పంపుటకు నారుమడులలో కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నారు వేసిన 10-15 రోజుల మధ్యలో ప్రతి 5సెంట్ల నారుమడికి 2 కిలోల యూరియా, 2 కిలోల డిఏపి, 2 కిలోల పోటాష్ ఎరువులను తప్పని సరిగా వేయాలన్నారు. ఈ. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది గౌరినాయుడు, రేణుక, శ్రీమవాసరావు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్:రావికమతం మండలంలో రావికమతం, కొమిర, చినపాచిల తదితర గ్రామాల్లో వరి నారు మడులను రావికమతం మండల వ్యవసాయ అధికారిని డి.రూప పరిశీలించారు. రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు వాడకం, ఉపయోగాలను వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరి నారు మడులు సంరక్షనపై వివరించారు. ఈ కార్యక్రమంలో పలువు రైతులు పాల్గొన్నారు.

రెల్లిలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో రెల్లి కులస్థులకు సముచిత స్థానం కల్పించాలని రెలి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు డిమాండ్ చేశారు. మంగళవారం చెట్టుపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. రెల్లిలు అన్ని రంగాలలో వెనుక బడి ఉన్నారన్నారు. ఎస్సీలతో పాటు రెల్లిలకు కూడా నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పించాలని కోరారు. కూటమి గెలుపునకు రెల్లిలు కూడా కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. గత వైసిపి ప్రభుత్వం దళితుల సంక్షేమ పథకాలు రద్దు చేసి మోసం చేసిందన్నారు. కుటమి ప్రభుత్వం అట్రాసిటీ చట్టం కఠినంగా అమలు చేయాలన్నారు. దళితుల భూములు వారికే దక్కేలా భూ చట్టాన్ని పటిష్టం చేయాలన్నారు.


ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అసాంఘిక శక్తులను ఎయులోకి రానీయొద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలోకి అసాంఘిక శక్తులను, నేరారోపణ కేసులు ఉన్న వ్యక్తులను రానివ్వొద్దని అఆ ఫౌండేషన్ తరపున విశాఖపట్నం లాయర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎయు ఇంచార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య కిషోర్‌బాబును ఆ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బైపా అరుణ్ కుమార్, ప్రతినిధులు వై.చిన్నారావు, కె.రమణ, పి.శ్రీనివాసరావు, ఎంవి.లక్ష్మి తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు వర్సిటీకి చెందిన కొంతమంది సహకారంతో యూనివర్సిటీలో చొరబడి అలజడి రేకెత్తిస్తూ విద్యా వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారన్నారు. యూనివర్సిటీకి చట్టబద్ధమైన సంబంధం లేని వ్యక్తులు క్యాంపస్, అడ్మినిస్ట్రేటివ్ భవనాల్లోకి ప్రవేశించడం, ఆటంకాలు సృష్టించడం చేస్తున్నారని ఆరోపించారు. కోటి జాన్, ఆరేటి మహేష్ అనే వ్యక్తులు యూనివర్సిటీ పరిపాలనా భవనంలోకి వచ్చి అక్కడ వాతావరణం చెడగొడుతున్నారని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకువచ్చారు. ఆ వ్యక్తులు నేర కార్యకలాపాలకు పాల్పడ్డారని, వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని గుర్తుచేశారు.

ఏకలవ్య పాఠశాలల్లో స్థానిక ఉపాధ్యాయులను నియమించాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఏకలవ్య మోడల్ పాఠశాలలు, కళాశాలల్లో స్థానిక భాష తెలిసిన గిరిజన ఉపాధ్యాయులనే నియమించాలని వనవాసి స్వచ్ఛంద సేవ సంస్థ డైరెక్టర్ గొర్లె అనుదీప్ కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యులు గొర్లె అనిల్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ పాఠశాలలు/ కళాశాలల్లో విద్యా బోధన పూర్తిగా హిందీ, ఇంగ్లీష్‌లోనే ఉంటుందని, దీంతో అర్థం కాక గిరిజన విద్యార్థులు ఆందోళనకు, గందరగోళానికి గురవుతున్నారని పేర్కొన్నారు. స్థానిక సంస్కృతి, ఆచార వ్యవహారాలు, స్థానిక భాష తెలిసిన గిరిజనులకే ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. గతంలో మాదిరిగా స్థానిక తెలుగులోనే బోధించాలని, లేదా అన్ని అర్హతలు, పూర్తి పరిజ్ఞానం ఉన్న గిరిజన ఉపాధ్యాయులను మెరిట్ ద్వారా ఎంపిక చేసి తెలుగులో, స్థానిక భాషలో అర్థమయ్యే రీతిలో బోధించే వారిని నియమించాలని డిమాండ్ చేశారు. ఏకలవ్య పాఠశాల, కళాశాలల్లో కేంద్రీకృత నియామక విధానాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

గృహ నిర్మాణ సామగ్రి వితరణ

ప్రజాశక్తి- కూనవరం : అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడ్డ రెండు కుటుంబాలకు ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ మంగళవారం ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంటు రేకులు, ఐరన్ పైపులను అందజేశారు. ఈ ఏడాది మే నెల 29వ తేదీన మండలంలోని గొమ్ముగూడెం గ్రామంలో అగ్ని ప్రమాదం సంభవించి కొక్కిరాల అనంతరావు, కంటే బాబురావు ఇళ్లు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న జమాల్ ఖాన్ నాడు ఒక్కో కుటుంబానికి రూ.5000 చొప్పున అందజేశారు. ఇంటికి కావాల్సిన సామాగ్రిని అందజేస్తామని నాడు హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం రూ.60వేలు విలువగల సామాగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో కూనవరం టిడిపి నాయకులు ఏడవల్లి భాస్కర్, ప్రకాష్, ఇప్పుడు అప్పారావు, ఉమా, రసూల్, సూఫీ తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని వడ్డుగూడెం పంచాయతీ పరిధి విఆర్ పురం గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయితీ సర్పంచ్ నరసమ్మ, కార్యదర్శి స్వరూప రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య పనులు చేయించారు. రహదారులపై ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాలు మొదలవడంతో సీజన్లో వచ్చే వ్యాధులు పట్ల ముందు జాగ్రత్త చర్యగా ఈ శానిటేషన్ పనులు చేపట్టినట్లు చెప్పారు. ప్రజలు ఎలాంటి రోగాలు బారిన పడకుండా ఉండాలని, ఇంటి చుట్టూ నీటి నిల్వలు ఉండకుండా, చెత్తాచెదారం లేకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-రంపచోడవరం : సీజనల్ వ్యాధులపై స్థానిక పిఎమ్ఆర్‌సి సమావేశ మందిరంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డయేరియా, మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులపై పంచాయతీలు తీసుకోవాల్సిన చర్యలు, ముందస్తు ప్రణాళికలు గురించి చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు మాట్లాడుతూ హైరిస్క్ గ్రామాలను గుర్తించి వాటిల్లో వారానికి ఒకసారి లార్వా మందు పిచికారి, ఫాగింగ్ చేయాలని సూచించారు.

డిఎల్‌పిఒ జి.రాఘవన్ మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం ప్రతిఒక్కరూ కార్యాచరణ అమలు కోరారు. మలేరియా విభాగం ఎఎంఒ శీనివాసరాజు మలేరియా, డెంగ్యూ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

ఫ్లోరింగ్ మరమ్మతులు చేయిస్తా

ప్రజాశక్తి-ఎటపాక : మండలంలోని కన్నాయిగూడెం గ్రామపంచాయతీ పరిధి ఫర్గూసన్‌పేట పాఠశాల భవనం ఫ్లోరింగ్‌కు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన మరమ్మతులు చేస్తామని ఆ ట్రస్టు చైర్మన్, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ హామీ ఇచ్చారు. ఫర్గూసన్ పేటలోని పాఠశాల భవనం ఫ్లోరింగ్ పగుళ్లు ఏర్పడి చిన్న పిల్లలు కూర్చునేందుకు వీలు లేకుండా అధ్వానంగా ఉందని, దానికి మరమ్మత్తులు చేయాలని ఇటీవల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్య కమిటీ సభ్యులు జెకెసి ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్‌కు విన్నవించారు. దీనికి స్పందించిన జమాల్ ఖాన్ మంగళవారం ఆయన తన సిబ్బందితో కలిసి ఫర్గూసన్‌పేట ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాన్ని కూడా ఆయన పరిశీలించి సౌకర్యాలు సరిగా లేదని వాటిని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. వారం రోజుల్లో పాఠశాల ఫ్లోరింగ్‌కు తన ట్రస్ట్ ద్వారా మరమ్మతులు చేసి ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షాజహాన్, జావేద్, ఎస్‌కే రియాజ్, ఇంతియాజ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వితంతువు కుటుంబానికి ఆర్థిక సాయం

కూనవరం : మండలంలోని టేకులబోరు గ్రామానికి చెందిన వితంతువు కందుల నాగమణికి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ మంగళవారం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన కందుల ప్రశాంత్ మే నెలలో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆయన భార్య నాగమణి, ఇద్దరు చిన్నారులతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతుంది. కూలి పనులు చేసుకుంటూ పిల్లలను, తండ్రి వెంకటేష్‌ను పోషించుకుంటుంది. నాగమణి పడుతున్న ఆర్థిక ఇబ్బందుల గురించి స్థానికులు జమాల్ ఖాన్ దృష్టికి తీసుకువెళ్లగా మంగళవారం ఆయన బాధ్యత కుటుంబాన్ని పరామర్శించి తక్షణసాయంగా రూ.5000 అందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం అరకు పార్లమెంట్ సభ్యులు ఎడవల్లి భాస్కర్, మండల అధ్యక్షులు ప్రకాష్, పోడియం అప్పారావు, ఉమా, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

రమేష్ కుమార్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి -సీలేరు : సీలేరు జల విద్యుత్ కేంద్రం నుంచి బదిలీపై విటిపిఎస్ వెళ్తున్న ఎఇ బి.రమేష్ కుమార్‌ను స్థానిక జల విద్యుత్ కేంద్రంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈఈలు రాజేంద్రప్రసాద్, ప్రభాకర్, ఏఈ సురేష్, ఇంజనీర్ అసోసియేషన్ నాయకులు ఏడి ఈ శ్రీనివాస్, ఏఈ మెకానికల్ నాగబాబు, సబ్ ఇంజనీర్లు శ్రీనివాస్, శ్రీధర్, ఏపీ జెన్‌కో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు కాంట్రాక్టర్లు రమేష్‌కుమార్‌కు దుస్సాలువ, పూలమాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఈఈ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఏఈ రమేష్ కుమార్ వర్క్ నాలెడ్జి నైపుణ్యం కలిగిన వ్యక్తిగా ఏపీ జెన్కో విద్యుత్ సౌధ లెవెల్‌లో మంచి గుర్తింపు పొందారని తెలిపారు. మొదటి యూనిట్ మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెలాఖరు వరకు ఉంటే బాగుంటుందని పేర్కొన్నారు. ఈఈ సివిల్ ప్రభాకర్ మాట్లాడుతూ రమేష్ కుమార్ వర్క్ ఫీల్డ్‌లో సిన్సియారిటీ వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో ఏపీ జెన్కో ఇంజనీర్లు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

అపారిశుధ్యం తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన



జోరుగా సాగుతున్న పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు మండలం రాజేంద్రపాలెంలోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ సమీపంలో ఉన్న అపారిశుధ్యాన్ని పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యాన మంగళవారం తొలగించారు. సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ వద్ద డ్రైనేజీ వ్యవస్థ బాగోలేక మురుగునీరు సీసీ రోడ్డుపైనే నిల్వ ఉండి, దానికి వర్షం నీరు తోడు కావడంతో రోడ్డంతా బురదబురదగా, అత్యంత అధ్వానంగా ఉండడంపై ప్రజాశక్తి పత్రిక మంగళవారం ప్రచురించిన వార్తకు కొయ్యూరు ఎంపీడీవో లాలం సీతయ్య స్పందించారు. అపారిశుధ్యాన్ని తొలగించాలని వెంటనే పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో కార్యదర్శి జెసిబి సహాయంతో రోడ్డుపై ఉన్న అపారిశుధ్యాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతయ్య మాట్లాడుతూ ఈ డ్రైనేజీ వల్ల చుట్టుపక్కల ఉన్న ప్రజలకు గాని, సమీపంలో ఉన్న స్కూలు పిల్లలకు గాని ఎలాంటి రోగాలకు రాకూడదని ఉద్దేశంతో పత్రికలలో వచ్చిన కథనాలను చూసి వెంటనే సంబంధిత పంచాయతీ సెక్రెటరీచే డ్రైనేజ్ పనులను శుభ్రం చేయించినట్లు చెప్పారు.

దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి-కోటవురట్ల:దోమల నివారణ పై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అసిస్టెంట్ అప్పారావు తెలిపారు. మంగళవారం కేజీబీవీ పాఠశాల లో దోమల నివారణకై మందులు పిచికారి చేశారు. అనంతరం విద్యార్థులకు దోమల నివారణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు

ప్రజాశక్తి -కోటవురట్ల:ప్రభుత్వం ఉచిత ఇసుక ప్రకటించినా.. అక్రమంగా ఇసుక రవాణా చేపడితే చర్యలు తప్పవని తహసిల్దారు వెంకటరమణ హెచ్చరించారు. సోమవారం రాత్రి సమయంలో పందూరు, గొట్టువాడ గ్రామాల వద్ద నిల్వ ఉంచిన ఇసుక వనరులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరాహ నది సమీపం నుండి ఇసుకను పగలు ఎడ్ల బండ్ల ద్వారా తరలించి నిల్వ చేసి రాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో గ్రామ రెవెన్యూ అధికారులతో దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎడ్ల బళ్ళు ద్వారా నేరుగా లబ్ధిదారులు వినియోగించుకున్నా ఇబ్బంది లేదని, ఇదే అదునుగా ఇసుక వ్యాపారం చేసినట్లయితే చర్యలు తీవ్రంగా ఉంటాయని తెలిపారు. ట్రాక్టర్ల ద్వారా కొనుగోలు చేసుకోవాలనుకుంటే నక్కపల్లి వద్ద ఇసుక స్టాక్ పాయింట్ నుంచి కొనుగోలు చేసుకోవాలన్నారు. రెవిన్యూ సిబ్బందిని గ్రామాల్లో అప్రమత్తం చేస్తున్నట్లు చెప్పారు.

బయలుపూడిలో కంటి శిబిరం

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలోని బయలుపూడి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ జాజిమొగ్గల సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరంలో సుమారు 180 మందికి పరీక్షలు చేశారు. 20 మందిని కంటి ఆపరేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ స్వాములు, ఆప్తమాలజిస్ట్ లోకేష్, విజన్ టెక్నీషియన్ గౌరీ, మోషన్ ఐ బ్యాంక్ కాత్యాయని, ఫీల్డ్ అసిస్టెంట్ భూపతి, సంతోష్ పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యతపై శాంపిల్స్ సేకరణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక మున్సిపాలిటీ మెయిన్ రోడ్డు విస్తరణ పనులపై మంగళవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు శాంపిల్స్ సేకరించారు. గతంలో రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంపిల్స్ సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, క్వాలిటీ కంట్రోల్ అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గైరమ్మ సత్యం మృతి

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంటకు చెందిన రైతు సంఘం నాయకుడు మడ్డు సత్యనారాయణ (గైరమ్మ సత్యం) సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన గత ఆరు నెలలుగా కేన్సర్ వ్యాధికి చికిత్స పొందుతూ మృతి చెందారు.ఆయన మండలంలో రైతులకు ఏ సమస్య వచ్చినా సహాయ, సహకారాలు అందించేవారు.గ్రామంలో రాజకీయాలకు అతీతంగా అందరికి సేవలందించారు. వినాయక దేవాలయం, కాటా వద్ద వేణుగోపాల స్వామి ఆలయాల నిర్మాణం, సంతబయలు వద్ద నంది విగ్రహం ఏర్పాటు చేయడం ఆయన కృషి చేశారు. గతంలో అనివార్య పరిస్థితుల్లో గ్రామ దేవత మహోత్సవం నిలిపివేయగా ఆయన ముందుండి గౌరమ్మ ఉత్సవాన్ని నిర్వహించారు. అందుకే ఆయనకు గైరమ్మ సత్యం అనే పేరు వచ్చింది. గైరమ్మ సత్యం మృతదేహానికి ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, కొవ్వూరు సర్పంచ్ బాబులనాయుడు, ఎంపిటిసి సుర్ల రామకృష్ణ, జెడ్పీటీసీ పోతల శ్రీనివాసరావు, గ్రామస్థులు, బంధువులు నివాళ్లు అర్పించారు.

మొక్కల నాటివేత

ప్రజాశక్తి -అనకాపల్లి డెస్క్:ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ఫారెస్ట్ రేంజర్ గౌరేశ పిలుపునిచ్చారు. అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలో కస్తూరిబా పాఠశాల, సిద్ధార్థ కాన్వెంట్లో సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో తల్లి చేసిన మేలు మాదిరిగా ప్రకృతిలో మనకు చెట్లు, మొక్కలు చేస్తాయని తెలిపారు. విద్యార్థులు మొక్కలను చెట్లుగా ఎదిగేందుకు బాధ్యత తీసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గొలుగొండ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొలుగొండ పిహెచ్సి వైద్యాధికారి శ్యాం కోరారు. మండలంలో జోగంపేట పిహెచ్సి పరిధిలోగల పొగ చెట్ల పాలెం గ్రామంలో వెక్టార్ బోర్న్, సీజనల్ వ్యాధుల గురించి గ్రామ ప్రజలకు అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు .


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి హిమబిందు

ధర్మపురంలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ధర్మపురం గ్రామంలో చిన్నపిల్లలు జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారని ఆశా కార్యకర్త ఇచ్చిన సమాచారంతో వైద్యాధికారి డాక్టర్ డికె.హిమబిందు ఆధ్వర్యాన మంగళవారం ఆ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పిహెచ్‌సి నుండి 10 కిలోమీటర్లు వాహనంలో వెళ్లి, అక్కడి నుంచి రోడ్డు లేకపోవడంతో మూడు కిలోమీటర్లు వైద్యాధికారి, సిబ్బంది కాలినడకన ధర్మపురం గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో వివిధ రోగాలతో బాధపడుతున్న చిన్నారులు, పెద్దలు 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వర బాధితులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ ప్రస్తుతం ఎపిడమిక్ సీజన్ కావడంతో గ్రామాల్లో జ్వరాలు, అతిసారా, దగ్గు, జలుబు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వర బాధితులు సమీపంలో ఉన్న ఆశా కార్యకర్త, ఏఎన్ఎంకి సమాచారం ఇస్తే ఇంటికొచ్చి రక్త పరీక్ష చేస్తారని, మలేరియా వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడాలని కోరారు. చలితో కూడిన జ్వరాలను నిర్లక్ష్యం చేయరాదని, తక్షణమే ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందాలని సూచించారు. జ్వరాలు ఇతర రోగాలకు పసర మందులు, నాటు వైద్యం చేయించుకోవద్దని హితవుపలికారు. కాచి వడబోసిన నీళ్లను తాగాలని, వేడి ఆహారం తినాలని, నిల్వ మాంసం తినకూడదని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండగా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ ఈఓ పోతురాజు, ఏఎన్ఎం ఈశ్వరి, శోభ పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సీలేరు : తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఇద్దరు చిన్నారులను అర్ధరాత్రి ఆసుపత్రికి తీసుకొస్తే వారికి సరైన వైద్యం అందించకుండా తల్లిదండ్రులపై కేకలు వేసిన సీలేరు పిహెచ్‌సి వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని గాలికొండ ఎంపీటీసీ సభ్యులు ఎ.బుజ్జిబాబు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ సీలేరులో నివాసముంటున్న స్వామి రమణ వాంతులు, విరోచనాలు, జ్వరంతో బాధపడుతున్న ఇద్దరు కుమారులను ఆదివారం రాత్రి 11 గంటలకు వైద్య సేవ నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారని తెలిపారు. ఆస్పత్రిలో నర్సు పిల్లలు అనారోగ్య పరిస్థితిపై ఫోన్ చేసి వైద్యాధికారికి తెలియజేయగా, ఆమె పిల్లల స్థితిగతుల గురించి అడగకుండా, వైద్య సేవలు అందించడానికి సత్వర చర్యలు చేపట్టకుండా తల్లిదండ్రులపై కేకలు వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆసుపత్రికి వచ్చిన వైద్యాధికారి పిల్లలకు వైద్యం అందించకుండా ఇంత రాత్రిపై తీసుకురావడం ఏమిటని తల్లిదండ్రులు స్వామి రమణ, సుహాసినితో ఘర్షణకు దిగడం సరి కాదన్నారు. దీన్ని బట్టి చూస్తే ఏజెన్సీ ప్రాంత ఆస్పత్రుల్లో 24 గంటలు వైద్య సేవలు ఎంత బాగా ప్రజలకు అందుతున్నాయో తెలుస్తుందని పేర్కొన్నారు. ఈ విషయంపై కలెక్టర్, పిఓ స్పందించి వైద్య అధికారిపై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ బుజ్జిబాబు డిమాండ్ చేశారు.

28న ఉత్తమ విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు కేంద్ర గౌరీ సంఘం విశాఖ అధ్యక్షులు బుద్ధ శివాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్‌లో 80 శాతానికిపైగా మార్కులు సాధించిన వారికి, పాలిటెక్నిక్, ఎంసెట్, ఐఐటి, గేట్, ఐసెట్, ఈసెట్, ఆసెట్, లాసెట్, ఎపిఆర్‌జెసి, పీజీ సెట్లలో ర్యాంకులు సాధించిన వారికి ఈ నెల 28న నగదు బహుమతి, జ్ఞాపికతో పాటు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. విశ్వనాథ కన్వెన్షన్ హాల్ (పోర్టు కళావాణి స్టేడియం)లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.అదే విధంగా ఆధారం లేని గవర జాతి మెరిట్ విద్యార్థులు 10 మందికి రూ.10 వేల చొప్పున ఉపకార వేతనాలను అందజేస్తామన్నారు.